# బాలమిత్ర

జూన్ - 1996





# ఉద్యోగం

శివ, సాయిబాబా భక్తుడు. సాయిబాబా మీద అతనికున్న భక్తి ఎలాంటిదంటే, తాను ఏపని చేస్తున్నా, చదువుతున్నా, ఏవయినా కొంటున్నా అన్నింటికీ బాబాని అడిగి, ఆయన సలహా తీసుకుని మరీ చేస్తూండటం అతని అలవాటు.

మధ్య తరగతి కుటుంబానికి చెందిన శివ డిగ్రీ పూర్తిచేసి అయిదేళ్ళుగా ఎన్నో ఉద్యోగాలకు అప్లై చేసినా, ఎన్నో ఇంటర్వ్యూలకు వెళ్లినా ఒక్కదాంట్లోనూ సెలెక్ట్ కాలేదు. ఏ పక్క వయసు పెరిగిపోతోంది. నిర్ణీత వయసు దాటిపోతే తనకిక ఎక్కడా ఉద్యోగం దొరకదని బాధపడుతూ ఉండేవాడు.

ఇలా ఉండగా ఒకరోజున శివకి ఒక పెద్ద కంపెనీ నుండి ఇంటర్వ్యూకి పిలుపొచ్చింది. అతను ఆ ఇంటర్వ్యూకి వెళ్లే ముందు షిరిడీకి వచ్చి బాబాని దర్శించుకుని, ''బాబా నేనో ఉద్యోగానికని వెళుతున్నాను. ఆ ఉద్యోగానికి చాలామంది వస్తున్నారు. ఉన్నది ఒక్కటే ఉద్యోగం. వచ్చేది చాలామంది. మీరు దయ చూపిస్తేకానీ నాకీ ఉద్యోగం రాదు'' అని బాబాని దీనంగా వేడుకున్నాడు.

బాబా దానికి- ''నీవేం కంగారుపడకు. నీకు ఈ బాబా తోడుంటాడు. ఆ ఉద్యోగం నీకే వస్తుంది. వెళ్ళిరా. ఎన్ని ఆటంకాలు, ఆపదలు వచ్చినా ముందుకు సాగిపో కానీ వెనక్కి మళ్లకు. ఆ ఉద్యోగం నీకే వస్తుంది'' అంటూ ఆశీర్వదించి పంపారు.

శివ ఆనందంగా ముందుకు సాగిపోయాడు. అయితే కొంత దూరం వెళ్ళేసరికి హఠాత్తుగా ఉరుములు మెరుపులతో గాలివాన మొదలయింది. ఆ హఠాత్పరిణామాన్ని చూసి శివ ఆశ్చర్యపోయాడు.

''ఇప్పటిదాకా బాగున్న వాతావరణం ఇంత అకస్మాత్తుగా ఎలా మారిపోయిందబ్బా'' అనుకుంటూ... ''అయ్యో! ఇప్పుడెలాగ ఇంటర్వ్యూకి ఈ వానలో తడుస్తూ ఎలా వెళ్ళటం.

జి. రామలక్ష్మి, హైద్రాబాద్

టైము కూడా దాటిపోతోంది'' అనుకుంటూ ఓ చూరు కిందకు వచ్చి నిలబడ్డాడు. అంతలోనే ఆ ఇంటి కప్పు నుండి ఓ పెంకు ఊడి అతని తలమీద పడి గాయం అయి రక్తం కారసాగింది.

''అమ్మా!'' అంటూ అతను మూలిగి జేబులోనుంచి రుమాలు తీసి తలకి కట్టు కట్టుకున్నాడు. చాలాసేపటికి కానీ వర్షం తగ్గలేదు. ఓ పక్క చలి, ఓ పక్క తగిలిన దెబ్బ వల్ల నొప్పి, మరొక పక్క ఇంటర్వ్యూకి హాజరుకాగలనో లేదో అనే కంగారు, ఇలాంటి పరిస్థితిలో బాబాని తల్చుకుంటూ ఏడ్చాడు. అంతలోనే వర్షం వెలిసింది. శివ ఇంటి దారి పట్టబోయి నాలుగడుగులు వేసాడో లేదో ''ఎన్ని కష్టాలు వచ్చినా వెనుకడుగు వేయకు'' అన్న బాబా మాటలు అతని చెవుల్లో మారు మ్రోగాయి.

బాబా మాటపై విశ్వాసంతో ఇంటర్వ్యూకి వెళ్ళాడు. అప్పటికి అందరి పేర్లూ పిలవడం, ఇంటర్వ్యూలు చేయటం పూర్తయి ఆఖరుగా ''శివా... శివా...'' అన్న కేక వినిపించింది.

అప్పుడే అక్కడికి చేరిన శివ ఆనందంగా లోపలికి వెళ్లాడు. ఇంటర్వ్యూ పూర్తిచేసుకుని బయటకు వచ్చాడు మరికాస్సేపటికి. అందర్నీ అక్కడే ఉండమని చెప్పి ఆ సాయంత్రమే ఫలితాలు చెప్పారు. అందులో శివ సెలెక్ట్ అయ్యాడని, మరుసటి రోజునుంచే జాయిన వ్వమని ఆర్డర్స్ యిచ్చారు. అందరూ అతనికి అభినందనలు చెప్పారు.

శివ, బాబాకి కృతజ్ఞతలు తెలుపుకొని ఆనందించాడు. బాబాని సహస్రవిధాల పొగిడాడు. 'అదే తాను బాబా మాటలు వినకుండా ఇంటి దారి పట్టివుంటే - తనకీ ఉద్యోగం దొరికివుండేదే కాదని' మనసులో అనుకున్నాడు.

బాబా ఏది చెప్పినా అది మన మంచికే అని పూర్తి నమ్మకంతో మన దృష్టిని బాబా మీదే వుంచితే - బాబా మనని అన్ని విధాలా ఆదుకుంటారు. మనకు తగిన సాయంచేస్తారు. తోడు నీడగా ఉంటారు. బాబా సకరలరూప సార్వభౌముడు.

